

మంత్రి అచ్చెన్నాయుడు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర వ్యవసాయశాఖ, సహకార, మార్కెటింగ్, మత్స్య, పశుసంవర్థక శాఖ మంత్రిగా కింజరాపు అచ్చెన్నాయుడు అమరావతిలోని సచివాలయంలో గల తన ఛాంబరులో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం అమలు ఫైలుపై తొలి సంతకం చేశారు.



అండమాన్‌లో అండగా...

- వైద్యం వికటించి సిక్కోలు మత్స్యకార మహిళ మృతి
- ఆందోళన చేసిన వారిపై పోలీసుల లాఠీఛార్జి
- ఏకమైన అక్కడి తెలుగు జాలరులు
- సంఘీభావం తెలిపిన రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు

వారంతా అప్పుడెప్పుడో అండమాన్ నికోబార్ ఐలాండ్ ప్రాంతానికి వలస వెళ్లి బతుకుతున్న మత్స్యకారులు. వీరిలో ఎక్కువ మంది చేపల వేటపై ఆధారపడి బతుకుతుండగా, కొద్దిమంది ఇతర వృత్తుల్లో కుటుంబాలతో సహా స్థిరపడ్డారు. శ్రీకాకుళం జిల్లాతో పాటు విజయనగరం, విశాఖ, ఉభయగోదావరి జిల్లాలతో పాటు తమిళనాడుకు చెందిన వారు వేలాది మంది అక్కడ జీవనం సాగిస్తున్నారు. ఏ కష్టం వచ్చినా ఒకరికొకరు అండగా నిలుస్తూ ఎవరి వృత్తి వారు చేసుకుంటున్నారు. అండమాన్ అండ్ నికోబార్‌లోని పోర్టుబ్లెయిర్‌లో ఈనెల ఆరో తేదీన చోటుచేసుకున్న ఘటన వారందరినీ మరోసారి ఏకం చేసింది. వైద్యం వికటించి మృతి చెందిన విమల (21) కుటుంబానికి బాసటగా నిలిచి తెలుగు ఐక్యతను చాటారు. సిక్కోలుకు చెందిన మత్సకారులు, సంఘాలు వారికి సంఘీభావంగా తమవంతు సాయం చేశాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

పోర్టుబ్లెయిర్‌లోని తిరుపతి మందిర్ ప్రాంతంలో నివాసముంటున్న సోంపేట మండలం ఇసకలపాలెంకు చెందిన మత్స్యకారుడు కె.కృష్ణారావు భార్య విమల (21) తీవ్ర జ్వరంతో బాధపడుతుండడంతో ఈనెల ఆరో తేదీన కుటుంబసభ్యులు పోర్టుబ్లెయిర్‌లోని జిబి పంత్ ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. సకాలంలో వైద్యం అందక ఆమె మృతి చెందడం మత్యకారులను తీవ్రంగా కలిచివేసింది. చిన్న వయసులోనే విమల చనిపోవడం, ఆమెకు ఏడాదిన్నర వయసున్న బాబును చూసి అక్కడి వారు భావోద్వేగానికి లోనయ్యారు. విమల మృతి వార్త మత్స్యకారులు నివసిస్తున్న ప్రాంతాలకు పాకడంతో వందలాది మంది ఆసుపత్రికి చేరుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ఆసుపత్రి ఎదుట చేపట్టిన దీక్షలకు సంఘీభావం తెలిపారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తర్వాత పరిస్థితి మరింత ఉద్రిక్తతకు దారితీసింది. వైద్యుల తీరుపై మండిపడుతూ పోర్టుబ్లెయిర్‌లోని నాలుగు రోడ్ల కూడలి వద్ద చేపట్టిన ర్యాలీకి అనూహ్యంగా వేలాది మంది తరలివచ్చారు. పోలీసుల లాఠీ దెబ్బలు సైతం తిన్నారు. అక్కడి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేశవ చంద్ర స్పష్టమైన ఇవ్వడం మత్స్యకారులు ఐక్యంగా సాధించిన పోరాట ఫలితమేనని అక్కడి మత్స్యకార సంఘాలు చెప్తున్నాయి.



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

బాసటగా మత్స్యకార సంక్షేమ సంఘం నాయకులు

మత్స్యకార మహిళ మృతి ఘటన విషయంలో అక్కడి మత్స్యకార సంక్షేమ సంఘం, ప్రజాప్రతినిధులు ఆ కుటుంబానికి బాసటగా నిలిచారు. సంఘ కార్యదర్శి బి.హేమరాజు, నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు సభ్యులు సూరాడ ఉమామహేష్, 2, 14వ వార్డు కౌన్సిలర్లు ఆర్.సోమేశ్వరరావు, వై.జోగారావు, సామాజిక కార్యకర్తలు మోహిని, రవి, పలు సంఘాల నాయకులు దేవేందరరావు, సత్యప్రసాద్ సమస్య పరిష్కారానికి కృషి చేశారు. మరోవైపు సిపిఎంతో పాటు టిడిపి, కాంగ్రెస్ రాజకీయపక్షాలతో పాటు అక్కడి మత్స్యకార సంఘాలు సంఘీభావం తెలిపాయి.

సిక్కోలు మత్స్యకార సంఘాల చొరవ

అండమాన్‌లో మత్స్యకార మహిళ మృతిపై ఇక్కడి మత్స్యకారుల, మత్స్యకార సంఘాల నాయకులు వెంటనే స్పందించారు. తెలుగు మత్స్యకారులపై లాఠీఛార్జిని తీవ్రంగా ఖండించారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను జనసేన కార్యదర్శి బైపల్లి ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ బైపల్లి బాబూరావు కలిసి సమస్యను వివరించారు. ఆయన ఈ విషయాన్ని కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రమంత్రి అక్కడి అధికారులతో మాట్లాడడంతో హామీలపై భరోసా దక్కాయి. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలంటూ మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వాసు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు.

లెఫ్టినెంట్ గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లాం



వైద్యుల నిర్లక్ష్యంతోనే విమల మృతి చెందింది. ఆమె చనిపోవడం, తర్వాత జరిగిన పరిణామాలపై లెఫ్టినెంట్ గవర్నర్‌కు లేఖ రాశాం. ఆ కుటుంబాన్ని అన్నిరకాలుగా ప్రభుత్వం ఆదుకోవాలి. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నాం.

- బి.హేమరాజు, ప్రధాన కార్యదర్శి, ఫిషర్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ (అండమాన్ అండ్ నికోబార్)

మత్స్యకారులకు అండగా నిలవాలని...



తెలుగు మత్స్యకార కుటుంబానికి జరిగిన అన్యాయంపై అంతా అండగా నిలవాలని నిర్ణయించాం. మత్యకారులు అందరినీ సమీకరించి న్యాయం కోసం పోరాడాం. మృతురాలి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి వారిని ఆదుకోవాలి.

- సూరాడ ఉమామహేశ్వరరావు, నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు సభ్యులు

మత్స్యకారులపై లాఠీఛార్జి అమానుషం



అండమాన్‌లో మత్స్యకారులపై పోలీసులు లాఠీఛార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. వైద్యుల నిర్లక్ష్యంతో చనిపోయిన మత్స్యకార మహిళ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలి. మత్స్యకారులపై ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా చూడాలి.

- కర్రి గోపయ్య, జిల్లా మత్స్యకార ఐక్య వేదిక సభ్యులు

మా కుటుంబానికి న్యాయం చేయాలి



చేపల వేట సాగిస్తూ ఇక్కడే చాలాకాలంగా మా తల్లిదండ్రులతో కలిసి బతుకుతున్నాను. ఇక్కడి ప్రయివేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించాలంటే చాలా డబ్బులు ఉండాలి. డబ్బుల్లేక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లాను. అక్కడ డాక్టర్లు సరిగా చూడకపోవడంతో నా భార్య చనిపోయింది. మా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

- కె.కృష్ణారావు, మృతురాలి భర్త



మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థిక సంఘ సభ్య కార్యదర్శి రమణారెడ్డి

శాస్త్రీయంగా స్థానిక సంస్థలకు నిధులు

రాష్ట్ర ఆర్థిక సంఘ సభ్య కార్యదర్శి కె.వి రమణారెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

స్థానిక సంస్థలకు నిధుల కేటాయింపు శాస్త్రీయబద్ధంగా జరగాలని ఐదో రాష్ట్ర ఆర్థికసంఘం సభ్య కార్యదర్శి కె.వి రమణారెడ్డి అన్నారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఇఒపిఆర్‌డిలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కమిషన్ సభ్యులు ఎం.ప్రసాదరావు, ఎం.వి.ఎన్ పద్మారావు, కె.కృపారావుతో కలిసి మాట్లాడారు. చట్టపరంగా రాష్ట్ర ఆర్థిక సంఘం వివరణాత్మక నిబంధనలను సూచించిందని, వాటికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. అప్పుడే స్థానిక సంస్థలకు న్యాయబద్ధంగా, సమానంగా నిధుల పంపిణీ సాధ్యపడుతుందని చెప్పారు. ఆర్థిక సంఘం రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ఆర్థిక స్థితిగతులను సమీక్షించాల్సి ఉంటుందని తెలిపారు. స్థానిక సంస్థల ఆర్థిక స్థితి, జవాబుదారీతనం మెరుగుపరచడానికి, ప్రణాళికేతర, మూలధన వ్యయాలను తీర్చడానికి స్థానిక సంస్థల అవసరాలను అంచనా వేయడానికి సూచనలు చేయాలన్నారు. తగు చర్యలను సూచించాలని కోరారు. మూలధన ఆస్తుల నిర్వహణ, వాటి నిర్వహణ కోసం ఖర్చుల అంచనా కోసం నిబంధనలను సూచించడానికి కచ్చితమైన డేటా సేకరణ, విశ్లేషణను మిళితం చేసేందుకు జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల పన్ను వర్తింపు, వ్యయ సమస్యలు, ప్రాథమిక అవసరాల లభ్యత, కేంద్ర, రాష్ట్ర ప్రాయోజిత పథకాల్లో వారి భాగస్వామ్యం మొదలైన వాటి రశీదులు, ఖర్చుల గురించి సంబంధిత అధికారులు పూర్తిస్థాయి డేటాను సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం సర్పంచ్‌లతో మాట్లాడారు. సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, డిప్యూటీ సిఇఒ ఆర్.వెంకట్రామన్, డివిజనల్ పంచాయతీ అధికారులు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఇఒపిఆర్‌డిలు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీలో అవకతవకలు

ప్రజాశక్తి - పలాస

వైసిపి ప్రభుత్వ హయాంలో జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీలో అవకతవకలు చోటుచేసుకున్నాయని, వాటి నిగ్గు తేల్చాలని ఎమ్మెల్యే గౌతు శిరీష గృహ నిర్మాణ సంస్థ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని తన కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనర్హులకు ఇళ్ల పట్టాలను అందజేశారని చెప్పారు. దీనివల్ల అర్హులైన వారికి అన్యాయం జరిగిందన్నారు. వైసిపి నాయకులు అర్హత ప్రామాణికంగా కాకుండా తమకు నచ్చిన వారికి మంజూరు చేశారని ఆరోపించారు. ఇళ్ల పట్టాలకు సంబంధించిన వివరాలను తనకు అందజేయాలన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఎన్‌టిఆర్ గృహాలకు సంబంధించిన బిల్లులు ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ నగేష్, డిఇ అప్పారావు, ఎఇలు వైకుంఠరావు, రాంబాబు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌతు శిరీష

అన్యాయం జరిగితే సహించం

- తొలగించిన వారిని పనిలోకి తీసుకోవాలి
- మూలపేట పోర్టు వద్ద నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండలంలోని మూలపేట పోర్టులో పనిచేస్తున్న నిర్వాసిత గ్రామాలైన మూలపేట, విష్ణుచక్రంకు చెందిన 17 మందిని ఉద్యోగాల నుంచి తొలగించడంతో నిర్వాసితులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. స్థానిక సర్పంచ్ జీరు బాబూరావు ఆధ్వర్యాన గ్రామస్తులు పోర్టులోకి ప్రవేశించి ఉద్యోగాల తొలగింపుపై పోర్టు అధికారులను నిలదీశారు. ఉద్యోగాల నుంచి తొలగించడానికి కారణాలను అడిగినా పోర్టు అధికారులు చెప్పకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాధానం చెప్పాలని నిర్వాసితులు గట్టిగా నిలదీయడంతో స్థానిక టిడిపి నాయకులు చెప్పడం వల్ల తొలగించామని బదులివ్వడంతో మండిపడ్డారు. పోర్టు నిర్మాణానికి సహకరించని వాళ్ల భూముల్లో పంట సాగు చేసుకుంటున్నారని, సర్వం త్యాగం చేసిన తమపై రాజకీయ కక్షసాధింపులు ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ఇలా అయితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. పది రోజుల పాటు మూలపేట గ్రామస్తులకు పని ఆపుతున్నారని, మిగతా గ్రామస్తులకూ పది రోజులు పని ఆపాలన్నారు. పది రోజుల తర్వాత నిర్వాసిత గ్రామాలైన మూలపేట, విష్ణుచక్రం గ్రామస్తులందరికీ పోర్టులో పని కల్పించాలని కోరారు. అప్పటివరకు బ్రేక్ వాటర్ పనులు చేసుకోవాలన్నారు. పోర్టు నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, నిర్వాసితులందరికీ ఉద్యోగావకాశాలు కల్పించాలని పోర్టు డిజిఎం ఉమామహేశ్వర రెడ్డి, హెచ్‌ఆర్ మేనేజర్లు సంతోష్, వినోద్, ప్రవీణ్‌ను కోరారు. నిర్వాసితుల ఆందోళన నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా టెక్కలి సిఐ సూర్య చంద్రమౌళి, నౌపడ ఎస్ఐ కిషోర్ వర్మ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ఆందోళన చేస్తున్న మూలపేట నిర్వాసితులు

ప్రభుత్వం దృష్టికి ఖాదీ కార్మికుల సమస్యలు

చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత

ప్రజాశక్తి - పొందూరు

ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన పొందూరు ఖాదీ వడుకు, నేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారికి ప్రయోజనం కలిగేలా చూస్తానని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.సునీత అన్నారు. మండల కేంద్రంలోని ఎఎఫ్‌కెకె సంఘాన్ని శుక్రవారం సందర్శించారు. కార్మికులు చేపడుతున్న వడుకు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేత కార్మికులకు 50 ఏళ్లకు అమలవుతున్న పింఛన్ పథకాన్ని కార్మికులందరికీ వర్తించేలా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా చేనేత, ఖాదీ రంగాల నాయకులు, కార్మికులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఎఎఫ్‌కెకె సంఘం ఆధ్వర్యాన 800 మంది వడుకు, 50 నేత కార్మిక కుటుంబాలు పనిచేస్తున్నాయని, వీరికి ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లేదన్నారు. దీంతో యువత ఈ రంగంలోకి వచ్చేందుకు ఆసక్తి కనబరచడం లేదని తెలిపారు. ఇలాంటి పరిస్థితులు కొనసాగితే ఖాదీ రంగం అంతరించిపోతుందని ఎఎఫ్‌కెకె సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుంటుకు కామేశ్వరప్రసాద్, దండా వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఆమె ఖాదీ రంగం అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహాయ సహకారాలను అందిస్తానని హామీనిచ్చారు. అంపోలు చేనేత సొసైటీ ప్రతినిధి కాశిన ప్రసాద్ ఆప్కో నుంచి రావాల్సిన బకాయిలను సకాలంలో చెల్లించేలా చూడాలని కోరారు. చేనేత ఉత్పత్తులకు డిమాండ్ పెరగాలంటే యువతరాన్ని ఆకర్షించేలా అధునాతన డిజైన్లు రూపొందించాలని సూచించారు.

ఎఎఫ్‌కెకె సంఘానికి రూ.లక్ష విరాళం

మండలంలో ఏడాదిన్నరగా మూడు చేనేత క్లస్టర్లు నడుస్తున్నా, ఇప్పటివరకు లబ్ధిదారులకు ప్రయోజనాలు అందలేదని పలువురు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. లబ్ధిదారుల నుంచి పది శాతం వాటాను సేకరించి ఏడాదిన్నరవుతున్నా, నేటికీ చేనేత పరికరాలు సరఫరా చేయలేదని చెప్పారు. దీనిపై ఆమె స్పందిస్తూ వెంటనే డిఫాల్టర్లను తొలగించి తక్షణమే క్లస్టర్ లబ్ధిదారులకు పరికరాలు, ప్రయోజనాలు అందేలా చూడాలని ఆదేశించారు. ఖాదీ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్న ఎఎఫ్‌కెకె సంఘానికి ఆమె వ్యక్తిగతంగా రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో చేనేత, జౌళిశాఖ అదనపు డైరెక్టర్ కె.శ్రీకాంత్ ప్రభాకర్, ఎడి సిహెచ్.సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఖాదీ చీరలను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత

మైనర్లు వాహనాలు నడపడం నేరం

శ్రీకాకుళం అర్బన్ : నిబంధనలకు లోబడి చట్టాలకు అనుగుణంగా వాహనాలు నడపాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శి సిహెచ్.యోగంధర్ అన్నారు. నగరంలోని హెచ్‌పిఎన్ డిగ్రీ కళాశాలలో వాహన చట్టాలపై విద్యార్థులకు శుక్రవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి వేగంగా వాహనాలు నడపడం వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. 18 ఏళ్ల లోపు యువకులు వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడుతున్నారని చెప్పారు. లైసెన్స్ పొందని వారు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో జెఎంఎఫ్‌సి స్పెషల్ మొబైల్ కోర్టు సిహెచ్.శ్రీవిద్య, జూనియర్ సివిల్ జడ్జి మానీమ్ రోషిణి, హెచ్‌పిఎన్ ప్రిన్సిపాల్ టి.రామారావు తదితరులు పాల్గొన్నారు.



ప్రతి శుక్రవారం డ్రై డే

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- ప్రజలకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. డ్రై డే సందర్భంగా నగరంలోని కలెక్టర్ బంగ్లా రోడ్డు, పాత హౌసింగ్ బోర్డు కాలనీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందడానికి నిలయమైన నీటి నిల్వ కేంద్రాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఇంటి చుట్టూ ఉన్న రుబ్బురోలు, సంపులు, టైర్లు, కూలర్లు, వాడి పడేసిన పాత్రలు, నీళ్ల ట్యాంకులు, కుండలు, డబ్బాలు, కొబ్బరి చిప్పలు తదితర వాటిలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. డ్రై డే నాడు ప్రభుత్వ శాఖలన్నీ భాగస్వామమై ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించాలన్నారు. మురుగునీరు, కాలువల్లోనే కాకుండా మన ఇళ్లల్లోనూ దోమలు పెరుగుతాయని, వాటిని నివారించేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డెంగీకి కారణమయ్యే ఏడిస్ ఈజిప్ట్ దోమ మంచి నీటిలోనూ పెరుగుతుందన్నారు. అటువంటి దోమలు ఇంటి పరిసరాల్లోకి రాకుండా చూసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. పర్యటనలో శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరావు, ఎసిపి రమణమూర్తి, వైద్యారోగ్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

రైల్వే కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - పలాస

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ యూనియన్ ఆధ్వర్యాన రైల్వే కార్మికులు పలాస రైల్వేస్టేషన్ వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ మట్ట రామకృష్ణ మాట్లాడుతూ పాత పింఛను విధానం కొనసాగించాలని కోరుతూ దేశవ్యాప్తంగా కార్మికులు చేస్తున్న ఆందోళనపై కేంద్రం స్పందించాలని డిమాండ్ చేశారు. పింఛను లేకపోవడం వల్ల కార్మికుల భవిష్యత్ అగోమ్యగోచరమైందని, దీనిపై పునరాలోచించాలని కోరారు. కొత్త నియామకాలు చేపట్టాలని, ప్రైవేటు విధానానికి స్వస్తి పలకాలని, ఉద్యోగుల గృహాలు నిర్మించాలన్నారు. రైల్వే కాలనీలో మంచినీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. రన్నింగ్ స్టాఫ్, ఇంజినీరింగ్ సిబ్బందికి అదనపు సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.వి.వి.ఎన్ రావు, ఎం.ఉమాశంకర్, పి.ఎస్ రావు, పి.ఎల్ కృష్ణ, జి.ఎల్.కె రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పలాస రైల్వేస్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

పలాస అభివృద్ధికి తోడ్పాటునివ్వండి

కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే శిరీష

శ్రీకాకుళం అర్బన్ : పలాస నియోజకవర్గం అభివృద్ధికి పూర్తి సహకారాన్ని అందించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కలెక్టర్‌ను కోరారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. పలాస నియోజకవర్గంలో నెలకొన్న ప్రధానమైన సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. మత్స్యకార యువతకు సీమెన్, మర్చెంట్ నేవీ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేసేందుకు తోడ్పాటు అందించాలని కోరారు. రైతాంగ అవసరాలను దృష్టిలో పెట్టుకుని కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. తన తండ్రి మాజీ మంత్రి గౌతు శివాజీ ఇందుకు గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా స్థలాభావం వల్ల నిలిచిపోయిందని గుర్తు చేశారు. జీడి, కొబ్బరి రైతాంగాన్ని ఆదుకునేందుకు పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. గతంలో ఎపిఐఐసి కేటాయించిన 61 ఎకరాల స్థలం వివాదాల వల్ల నిలిచిపోయిందని, ఈ సమస్యను జిల్లాస్థాయిలో పరిష్కరించి పరిశ్రమల ఏర్పాటుకు సహకరించాలన్నారు. గతంలో సీతంపేట ఐటిడిఎ ద్వారా ఇక్కడి గిరిజనులకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేవారని, మందస ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

సహారా డిపాజిట్లు చెల్లించాలి

ప్రజాశక్తి - పలాస

సహారా డిపాజిట్లు తక్షణమే చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, సహారా ఏజెంట్లు కృష్ణారావు, సత్యరాజ్ డిమాండ్ చేశారు. కాశీబుగ్గలోని సహారా ఇండియా కార్యాలయం వద్ద ఏజెంట్ల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం రీజియన్ పరిధిలో సుమారు రూ.500 కోట్లు సహారా సంస్థ ద్వారా ఇవ్వాల్సి ఉందని తెలిపారు. సిఆర్‌సిఎస్ పోర్టల్‌ను సులభతరం చేసి, ఖాతాదారుల బ్యాంకు ఖాతాల్లో మొత్తం సొమ్ములు జమ చేసి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

లే అవుట్ పరిశీలన

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మండలంలో వసుంధర గ్రామంలో ప్రైవేట్ లేఅవుట్‌ను సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ శుక్రవారం పరిశీలించారు. అందుకు సంబంధించి భూ రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్లాట్లు వేయాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె. జానకమ్మ, ఆర్‌ఐ వైకుంఠరావు, సర్వేయర్ చలపతిరావు, విఆర్‌ఒ రమణ పాల్గొన్నారు.



పశువుల యజమానులతో మాట్లాడుతున్న కమిషనర్

రోడ్లపై పశువులు కనిపిస్తే చర్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలో పరిసరాలు పరిశుభ్రత పాటించాలని ఓవైపు ప్రజల్లో అవగాహన కల్పిస్తుంటే ఆవులను, గేదెలను నగరంలోని రోడ్లపై విచ్చలవిడిగా సంచరించేందుకు యజమానులు వాటిని విడిచి పెడుతున్నారని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరించారు. శుక్రవారం ఆవులు, గేదెల పెంపకందారులను వారి నివాస ప్రాంతాలకు వెళ్లి కలుసుకున్న ఆయన ఈ హెచ్చరికలు జారీ చేశారు. ప్రస్తుత వర్షాకాలంలో వీటిని రోడ్లపై విడిచి పెట్టడం వలన రోడ్లపై పేడ, ఇతర వ్యర్థాలతో అపరిశుభ్రత నెలకొంటోందని వారికి వివరించారు. రోడ్లపై వీటిని విడిచి పెట్టిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. హెచ్చరికలను పెడచెవిన పెట్టిన వారి ఆవులు, గేదెలను తీసుకెళ్లి సీతంపేట అటవీ ప్రాంతంలో విడిచి పెడతామని హెచ్చరించారు. ఆయనతో పాటు మున్సిపల్ హెల్తాఫీసర్ డాక్టర్ వెంకటరావు, అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్సీ దువ్వాడ

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

నూతన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను శాసనమండలి సభ్యుడు దువ్వాడ శ్రీనివాస్ శుక్రవారం కలిశారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. టెక్కలి నియోజకవర్గంలోని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు శ్రీనివాస్ తెలిపారు.

పరిశుభ్రతతోనే పల్లెల ఆరోగ్యం



నౌపడ : ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ ఉమాసుందరి



పొందూరు : కాలువలో బ్లీచింగ్ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి - ఆమదాలవలస

గ్రామీణ ప్రాంతంలో ప్రతి కుటుంబం వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే పల్లెల ఆరోగ్యం బాగుంటుందని కొర్లకోట సర్పంచ్ సనపల అన్నపూర్ణమ్మ అన్నారు. శుక్రవారం కొర్లకోటలో ఫ్రై డే, డ్రై డే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, ఎపిఎం పైడి కూర్మారావు మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ నీడ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకూడదని మహిళలకు అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది ఈ సీజన్‌లో డయేరియా, మలేరియా, డెంగీ తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పల నాయుడు, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ సూరపు నాయుడు, కార్యదర్శి సాగర్, సచివాలయ సిబ్బంది, వెలుగు సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ డి. సురేష్ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రై డే సందర్భంగా విద్యార్థులు, వైద్య సిబ్బందితో కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి కోర్టు వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రవి, హెచ్‌వి భూలక్ష్మి, ఫార్మసిస్ట్ చింతాడ వరుణ్ కుమార్, డిఇఒ హేమంత్ రమేష్, హెచ్‌ఎం రాములు, పి.మోహనరావు, పిఎస్ఆర్ నాయుడు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు. అలాగే దూసిలో వైద్యురాలు మాధురి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్త పంచాది లతాదేవి, పిహెచ్‌సి సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కవిటి: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు నివారించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తహశీల్దార్ లక్ష్మి అన్నారు. డ్రై డే పురస్కరించుకుని మండల వ్యాప్తంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి, సిబ్బందితో అవగాహన కల్పించారు. రెవెన్యూ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నౌపడ: సంతబొమ్మాళి మండలం పెద్ద తుంగభం, చిన్న తుంగం, తాళ్లవలసలో ఎంపిడిఒ ఉమాసుందరి ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చిన్న తుంగాం, తాళ్లవలస సర్పంచ్‌లు సిమ్మ గోవిందరావు, గున్న జానకమ్మ, కార్యదర్శులు విజయ్ కుమార్, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు. నౌపడలో సచివాలయ సిబ్బంది వి. వెంకట నారాయణ, ఆర్ కల్పన, సుగుణ రంజిత్, ఎఎన్ఎంలు, ఆశా, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: డ్రై డేలో భాగంగా స్థానిక బోరవీధి, సారిపిల్లి వీధి, చెవిటమ్మ తల్లి వీధిలో సచివాలయ ఉద్యోగులు, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యమంలో విఆర్ఒ రాము, వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మి నారాయణ, డిజిటల్ అసిస్టెంట్ శ్రావణ్ కుమార్, అంగన్వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, నిర్మల ఉన్నారు.

పలాస: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో డ్రై డేపై అవగాహన కల్పించారు. 16 సచివాలయాల పరిధిలో కమిషనర్ టి.నాగేంద్రకుమార్ ఆదేశాలతో బోరు బావులు, నీటికొళాయిలు, మురుగు కాలువల వద్ద నిల్వ ఉండే నీటిని తరలించి ప్రజలకు అవగాహన చేశారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ కె.ధర్మారావు, ఎఎన్ఎం మురళీకుమారి, శానిటేషన్ సెక్రటరీ కృష్ణారావు, మహిళా పోలీస్ లక్ష్మీ, ఎడ్యుకేషన్ సెక్రటరీ త్రివేణి, ఎమినిటీస్ సెక్రటరీ చందన, ఆశా నీరజ సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు: మండలం పిల్లలవలసలో సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు పర్యవేక్షణలో పారిశుద్ధ్యపనులు చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన మురుగు, చెత్తాచెదారాలు, పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ కృష్ణవేణి, విఆర్ఒ శ్రావణ్, సర్వేయర్ మనోజ్, వెటర్నరీ సిబ్బంది లక్ష్మణ్ పాల్గొన్నారు. అలాగే రాపాకలో డ్రైడే..ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శాంతిస్వరూప్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండల కేంద్రంలో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం లలిత, మండల మాజీ టిడిపి అధ్యక్షులు అనపాన రాజశేఖర్ రెడ్డి, బసవ పరమేశ్వర్ రెడ్డి, పానీల యుగంధర్, స్వర్ణలత సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆమదాలవలస : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది



కవిటి : ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

హెల్మెట్ ధారణతో ప్రాణాలకు రక్షణ

ప్రజాశక్తి - పాతపట్నం

వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, అది మన ప్రాణాలకు భద్రత కల్పిస్తుందని టెక్కలి మెజిస్ట్రేట్ తేజ చక్రవర్తి మల్ల అన్నారు. మండలంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల, మహేంద్ర కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే న్యాయపరమైన చట్టాలపై అవగాహన తెలుసు కోవాలని సూచించారు. యువత ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు వారి కుటుంబాలను దృష్టిలో ఉంచుకోవాలని, వారి ప్రాణాలు జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. స్థానిక ఎస్ఐ మహమ్మద్ యాసిన్ మాట్లాడుతూ హెల్మెట్ మన ప్రాణాలకు ఎంత అవసరమో విద్యార్థులకు వివరించారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే వారికి చట్టపరమైన శిక్షలు, జరిమానాలు ఉంటాయని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బిఇ సత్యనారాయణ, మోడల్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ చక్రధరరావు, మహేంద్ర ప్రిన్సిపాల్ మధు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: వాహనదారుడు, వాహనం వెనుకన కూర్చున్న వారు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని ఇన్‌ఛార్జి జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యార్థులతో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు దివ్వెల వివేకానంద, న్యాయవాదులు పి.సాయిరాజ్, పి.ఆనందరావు, పి.మధుబాబు, మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ డి.సంజీవరావు, ఎఎస్ఐ టి.నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.



టెక్కలి రూరల్ : మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

పొందూరు: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను వినియోగించడంలో నిర్లక్ష్యం వద్దని జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. కోర్టు ఆవరణలో శుక్రవారం కక్షిదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపరెంటిండెంట్ సత్య నారాయణ, న్యాయవాదులు మంజుల, బ్రహ్మాజీ, కృష్ణారావు, అశోక్, రాము, రామ్మోహన్, కిరణ్ పాల్గొన్నారు.

ఆస్తి తగాదాలో ఒకరిపై కేసు

కోటబొమ్మాళి: మండలం కొత్తపల్లికి చెందిన మట్ట శ్రీనుపై అదే గ్రామానికి చెందిన మట్ట సింహాచలం అస్థి తగాద విషయమై తనపై దాడిచేసి గాయపరిచారని శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఆస్థివిషయంపై గ్రామపెద్ద పనులు సమక్షంలో మాట్లాడుతుండగా మట్ట సింహాచలం కట్టెతో తనపై దాడి చేశాడని, దీంతో తలకు తీవ్ర గాయాలు కాగా టెక్కలి జిల్లా ఆస్పత్రికి చికిత్స కొసం వెళ్లానని, వైద్యులు తన తలకు కుట్లు వేశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో శ్రీను తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతామని పోలీసులు తెలిపారు.



వివరాలను వెల్లడిస్తున్న సిఐ, ఎస్ఐ

ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్ట్

ప్రజాశక్తి - ఆమదాలవలస

జిల్లాలో పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను పట్టణంలోని ఫ్లైఓవర్ దిగువన వైఎస్ఆర్ సర్కిల్ వద్ద ద్విచక్ర వాహనాలతో అదుపులోకి తీసుకున్నట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.దివాకర్ వాయునందన్ యాదవ్ తెలిపారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి ద్విచక్ర వాహనాల దొంగలను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఆమదాలవలస పోలీస్ స్టేషన్ పరిధిలో జొన్నవలస మెట్టెక్కివలస ప్రాంతాఖుఎష్ఠు రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. వీటిపై జిల్లా ఎస్‌పి జి.ఆర్ రాధిక సకాలంలో స్పందించి కేసులు పరిష్కరించాలని ఆదేశించడంతో ఎస్ఐ వెంకటేష్‌తో పాటు మరో నలుగురు పోలీసు సిబ్బందితో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శుక్రవారం పట్టణ శివారున ఉన్న వైఎస్ఆర్ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా శ్రీకాకుళం పట్టణానికి చెందిన బొమ్మలాట మోహన్, తోట శ్రీనివాసరావు అనే ఇద్దరు వ్యక్తులు దొంగతనం కాబడిన ద్విచక్ర వాహనాలపై రావడం గుర్తించి పట్టుకోవడం జరిగిందన్నారు. వీరిద్దరిని విచారించగా జొన్నవలస, మెట్టక్కివలస, ఎచ్చర్లకు సంబంధించిన మూడు ద్విచక్ర వాహనాలతో పాటు మరో మూడు ద్విచక్ర వాహనాలు లభించాయని తెలిపారు. అలాగే జిల్లాలో శ్రీకాకుళం, లావేరు, నరసన్నపేట పోలీస్‌స్టేషన్‌లలో కూడా వీరిద్దరిపై పలు కేసులు నమోదైనట్లు సిఐ తెలిపారు. ద్విచక్ర వాహనాల కేసును త్వరగా ఛేదించిన ఎస్ఐ వెంకటేష్‌తో పాటు కానిస్టేబుల్ నాయుడు, శ్యామ్, బాలును సిఐ అభినందించి రివార్డులను అందజేశారు.



దోయిసాగరం ఆక్రమణను పరిశీలిస్తున్న తహశీల్దార్ నాయుడు

దోయిసాగరం ఆక్రమణ పరిశీలన

ప్రజాశక్తి - పలాస

కాశీబుగ్గ అక్కుపల్లి రోడ్డు సర్వే నెంబర్ 243లో ఉన్న దోయి సాగరం ఆక్రమణను శుక్రవారం పలాస తహశీల్దార్ ఎస్ఎస్‌విఎస్ నాయుడు పరిశీలించారు. చెరువులో భూ ఆక్రమణలు జరిగినట్లు టిడిపి, జనసేన నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన తన బృందంతో దోయి సాగరాన్ని పరిశీలించారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు ఆర్ఐ నిరంజన్, విఆర్ఒలు ఖగేశ్వరరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



జెసిబితో తొలగిస్తున్న పునాదులు

అక్రమ పునాదులు కూల్చివేత


ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మండలంలో తులసీగాం పంచాయతీలో అక్రమంగా ఎటువంటి పత్రాలు లేకుండా నిర్మించిన పునాదులు అధికార యంత్రాంగం తొలగించారు. ఇటీవల ధర్మాపురంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు టిడిపి నాయకులు ఎమ్మెల్యే అశోక్ దృష్టికి ఈ అక్రమ పునాదులపై ఫిర్యాదు చేశారు. గతంలో కూడా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, అక్రమంగా లబ్ధిదారులకు ప్రలోభాలు పెట్టి ఈ అక్రమ పునాదులు వేశారని తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై అధికార యంత్రాంగం సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటుందని గ్రామస్తులకు ఎమ్మెల్యే చెప్పారు. ఎట్టకేలకు అక్రమ పునాదులుగా గుర్తించిన అధికార యంత్రాంగం శుక్రవారం జెసిబితో తొలగింపు చేపట్టారు. వైసిపి నేతలు మాత్రం ఇది దుందుడుకు చర్యని, అధికారం ఉంది కదా అని దౌర్జన్యంగా కూల్చి వేశారని విమర్శిస్తున్నారు. వైసిపి దౌర్జన్యాలకు న్యాయం దక్కిందని టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు సారథ్యంలో అభివృద్ధి

ప్రజాశక్తి - బూర్జ

టిడిపి అధినేత, సిఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో కేవలం అధికారం చేపట్టిన 30 రోజుల్లోనే 30 కార్యక్రమాలను అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి చెందుతుందని మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాజంపేట ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. 30 రోజుల్లో 16,347 టీచర్ పోస్టులతో మెగా డిఎస్‌సి నోటిఫికేషన్, వృద్ధాప్య, వితంతు పింఛన్ రూ.4000కు పెంపు, వికలాంగుల పింఛన్ రెట్టింపు చేసి రూ.6000 పెంపు, ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ఇంటి వద్దే పింఛన్ పంపిణీ చేపట్టారన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేయడం, ఉచిత ఇసుక అమలు చేయడంతో పాటు ఆగస్టు 15 నుంచి 183 అన్న క్యాంటీన్లు ప్రారంభానికి ఏర్పాట్లు చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. రాజధాని అమరావతి పనులు ప్రారంభం, తల్లికి వందనం మార్గదర్శకాలు విడుదల చేయడంతో పాటు మరెన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు.



మాట్లాడుతున్న విశ్వప్రసాద్

పశుగ్రాసాలతో పాడి పరిశ్రమకు లాభం



పాతపట్నం : మాట్లాడుతున్న కరుణాకరరావు

ప్రజాశక్తి - పాతపట్నం

పాడి పరిశ్రమ లాభసాటిగా ఉండాలంటే పశుగ్రాసాల సాగు తప్పనిసరని పాతపట్నం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు పాడి రైతులకు సూచించారు. మండలంలో దేవదళలో శుక్రవారం నిర్వహించిన పశుగ్రాస వారోత్సవాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పరిశ్రమలో తప్పనిసరిగా పశుగ్రాసాల సాగు చేయాలని, తద్వారా దాన ఖర్చు తగ్గించుకొని పాడి పరిశ్రమ లాభసాటిగా నిర్వహించేటట్లు చేసుకోవచ్చని ఆయన సూచించారు. ప్రతి పాడి రైతు తనకున్న భూమిలో ఐదు నుంచి 10 సెంట్లు పశుగ్రాసాల సాగుపై కేటాయించాలని చెప్పారు. పాడి పశువులు ఎక్కువగా పెంచే రైతులు సుమారుగా ఎకరం భూమి పశుగ్రాసాల సాగు కోసం వినియోగించాలని కోరారు. ఏక వార్షిక, బహువార్షిక పశుగ్రాసాల సాగుపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా దేవుదలలో పశుగ్రాస క్షేత్రాలను పశు వైద్యాధికారులు, సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. కార్యక్రమంలో పెదలోగిడి పశువైద్యాధికారి డాక్టర్ కె.మౌనిక, నిరంజన్, విజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: రైతు సేవా కేంద్రాల ద్వారా సబ్సిడీతో పశుగ్రాస విత్తనాలు సరఫరా చేయడం జరుగుతుందని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.రఘునాథ అన్నారు. వారోత్సవాల్లో భాగంగా మండలం హరిపురంలో పశుగ్రాసాలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సంపతరావు, రాఘవరావు, డాక్టర్ మెట్ట పూర్ణచంద్రరావు, పాడి రైతులు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న హరి వరప్రసాద్

కోటబొమ్మాళి: పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మండలం నిమ్మాడలో పశుసంవర్ధకశాఖ ఎడి డాక్టర్ ఎం.లోకనాథం మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్‌తో కలిసి పాడిరైతులకు అవగాహన కల్పించి సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేశారు. రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి - పలాస

మండలం రామకృష్ణాపురం, పెంటి భద్ర, జయ రామచంద్రపురం, పద్మనాభ పురం, అనంతపురం, పెసరపాడు, కోసంగిపురం, తాళభద్ర, నర్సిపురం, రాజపురం, అంతరకుడ్డ, నీలాపురం, జిఎంఇ కాలనీ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ జి. ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతులు చేపట్టేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆమదాలవలస: పట్టణ పరిధిలోని బొడ్డేపల్లిపేట సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఇఇ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వెంకయ్యపేట, లక్ష్ముడుపేట, జగ్గుశాస్త్రులపేట, పార్వతీశంపేట, బొడ్డేపల్లిపేట, పూజారిపేట, ఐజె నాయుడు కాలనీ, కృష్ణాపురం, మోణింగివారి వీధి, ప్రభుత్వ జూనియర్ కళాశాల, లక్ష్మీనగర్ కొంత భాగం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. ప్రజలందరూ విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

టెక్కలి రూరల్: టెక్కలి ఆది ఆంధ్రవీధి సబ్‌స్టేషన్ పరిధిలో టెక్కలి టౌన్, అయ్యప్పనగర్, భీంపురం, మేఘవరం, బొరిగిపేట, పాత జాతీయ రహదారి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.శంకరరావు తెలిపారు. మరమ్మతులు 33/11 కె.వి మరమ్మతులు చేపట్టడంతో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నౌపడ: నౌపడ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం మరమ్మతులు పనులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ శంకరరావు, సంతబొమ్మాళి ఎఇ శివకుమార్ ప్రకటనలో తెలిపారు. నౌపడ పరిసర ప్రాంతంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

ఆమదాలవలస: మండలంలోని తొగరాం సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ బయ్యన్నాయుడు ప్రకటనలో తెలిపారు. మండలంలోని దూసి, రైల్వే స్టేషన్, జికె వలస 11 కెవి ఫీడర్ల పరిధిలో గ్రామాలన్నింటికీ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని ఎఎస్ఎన్ కాలనీ పరిధిలో ఉన్న 33, 11 కెవి విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతులు కారణంగా నగరంలోని పలు ప్రాంతాలకు శనివారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు ఇపిడిసిఎల్ కార్యనిర్వాహక ఇంజినీరు సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకేంద్రం పరిధిలో ఎఎస్ఎన్ కాలనీ, గోవిందనగర్, ఇందిరానగర్, కృష్ణానగర్, తిలక్ నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు తెలిపారు. వినియోగ దారులు సహకరించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్లతో ప్రజలకు ఇబ్బందులు

టెక్కలి రూరల్: టెక్కలి ఆర్‌టిసి డిపో ఇసుక ర్యాంపు నుంచి తొలుసూరుపల్లి రోడ్డు చింతలగర వరకు వందలాది ట్రాక్టర్‌లు నిలుపుదల చేయడంతో ఉదయం, సాయంత్రం విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు ట్రాఫిక్ వలన ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం నాయకులు నంబూరి షణ్ముఖరావు ప్రకటనలో తెలిపారు. గ్రామాల నుంచి పట్టణానికి వచ్చే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని, వెంటనే అధికారులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని డిమాండ్ చేశారు. క్రమపద్ధతి లేకుండా వందలాది వాహనాలు ఇసుక లోడింగ్ కోసం వచ్చి ఉండడం వలన ప్రజలకు ఇబ్బందులు కలగటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని భవణ నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సత్తారు ఉత్తర, మోహన్ తదితరులు కోరారు.

కలెక్టర్‌ను కలిసిన ఆశ్రా ప్రతినిధులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నూతన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను జిల్లా అడ్వకేట్స్ అసోషియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్స్ అండ్ అవేర్‌నెస్ (ఆశ్రా) ప్రతినిధులు శుక్రవారం మార్యద పూర్వకంగా కలిశారు. సంఘం అధ్యక్షుడు డా గంజి ఎజ్రా ఆధ్వర్యాన కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబరులో కలుసుకుని పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. వినియోగదారులకు ఆశ్రా అందిస్తున్న సేవలను కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘ ప్రతినిధులు ఇందిరా ప్రసాద్, అనీల్ రాజు, బి.రవీంద్ర బాబు, రాము పాల్గొన్నారు.



కలెక్టర్‌ను సత్కరిస్తున్న ఆశ్రా సభ్యులు

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన కలమట

పాతపట్నం: మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు యాదవ్‌ను టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకట రమణమూర్తి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అచ్చెన్నాయుడును కలిసిన ఎంజిఆర్

పాతపట్నం: ఎపి వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్ధక, డెయిరీ డెవలప్మెంట్, మత్స్య శాఖల మంత్రిగా నేడు బాధ్యతలు చేపట్టిన కింజరాపు అచ్చెన్నాయుడును శుక్రవారం పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తన ఛాంబర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న రాజు

కవిటి: మండలం పెద్ద మెలియా పుట్టుగ గ్రామస్తులు లో ఓల్టేజ్ సమస్యతో బాధ పడుతున్నారని, దీంతో వారు తాగునీటికి ఇబ్బంది పడుతున్నట్టు ఇచ్ఛాపురం జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు అన్నారు. శుక్రవారం జనసైనికులు, గ్రామస్తులతో కలిసి విద్యుత్‌శాఖ ఎఇ నేతాజీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్ద మెలియా పుట్టుగ గ్రామస్తులు గత కొన్ని నెలలుగా విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్నారని, దీంతో ముఖ్యంగా తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామస్తుల అవస్థలు దృష్టిలో ఉంచుకొని వెంటనే వారి సమస్య పరిష్కరించాలని కోరారు. నాగుల హరి బెహర, జనసైనికులు, కూటమి ప్రతినిధులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం కేంద్రంగా తరలిస్తున్న గుట్కా, ఖైనీ మత్తు పదార్థాలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. శుక్రవారం పట్టణంలో అఖిలభారత యువజన సమాఖ్య జిల్లా సమితి ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం కేంద్రంగా జరుగుతున్న మత్తు పదార్థాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ర్యాలీ నిర్వహించి స్థానిక బస్టాండ్ వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజాడ యుగంధర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోరు వాసు, కొన్న శ్రీనివాసరావులు మాట్లాడుతూ ఇచ్ఛాపురం కేంద్రంగా ఒరిస్సా సరిహద్దుల ద్వారా అనేక ప్రాంతాల నుంచి మత్తు పదార్థాలు, గుట్కా, ఖైనీ వ్యాపారాలు కొనసాగుతున్నయని వాటిని నిలువరించడంలో ప్రభుత్వ అధికారులు, పోలీసు వ్యవస్థ జాప్యం చేస్తున్నాయన్నారు. భారతదేశంలో యువత ఎక్కువమంది ఉన్నప్పటికీ ఈ మత్తు పదార్థాల ద్వారా దేశంలో ఆదాని, అంబానీ వంటి కార్పొరేట్ వ్యక్తులకు పోర్టులు అప్పగించి ఆ పోర్టుల ద్వారా డ్రగ్స్,హెరాయిన్, కోకాయిన్ వంటి మత్తు పదార్థాలు దేశవ్యాప్తంగా యువత వద్దకు చేరే విధంగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారన్నారు. తక్షణమే మత్తు పదార్థాల వ్యాపారాన్ని, గుట్కా, ఖైనీ అమ్మకాన్ని నిషేధించాలని లేనియెడల అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ప్రత్యక్ష, పరోక్ష పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు సిద్ధార్థ, రామ్ కుమార్, కిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎఐవైఎఫ్ నాయకులు

రాయితీ కందిపప్పును సద్వినియోగం చేసుకోవాలి

ఇచ్ఛాపురం: ప్రభుత్వం అందిస్తున్న రాయితీ కందిపప్పు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బెందలాం అశోక్ అన్నారు. శుక్రవారం రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన కందిపప్పు స్టోర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా ఎర్రంనాయుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పిం చారు. రేషన్ కార్డుదారులకు ముందుగా సరఫరా చేసి తరువాత మిగిలిన లబ్ధిదారులకు అందించే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ అప్పారావు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో డిటి.శ్రీహరి, జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, కాళ్ల దిలీప్ కుమార్, పత్రీ తవిటియ్య, ఢిల్లీరావు, పద్మనాభం, నందిగాం కోటేశ్వరరావు, డీలర్ మౌళి, వల్లంపాటి మూర్తి పాల్గొన్నారు.



కందిపప్పును అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్



జ్ఞాపికను బహుకరిస్తున్న టిడిపి నాయకులు

మంత్రిని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి- నౌపడ

రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును నౌపడ టిడిపి నాయకులు సుగ్గు శాంతి స్వరూప్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అమరావతిలోని సచివాలయంలోని ఆయన చాంబర్‌లో నూతనంగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా జ్ఞాపికను బహూకరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే పంచాయతీకి సంబంధించిన పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలు విన్న మంత్రి సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి సత్వరమే కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కర్రి బాలకృష్ణ, కర్రి శంకర్, కర్రి రాజా పాల్గొన్నారు.



జెసిబితో తొలగిస్తున్న ఆక్రమణలు

ఆక్రమణల తొలగింపు

పలాస: మొగిలిపాడు జంక్షన్ జాతీయ రహదారి సమీపంలో పట్టణ ఆరోగ్య కేంద్రం ఆనుకొని ఉన్న భూ ఆక్రమణలను రెవెన్యూ అధికారులు తొలగించారు. మొగిలిపాడు సర్వే నెంబర్ 246/3లో నాలుగు సెంట్ల స్థలాన్ని కొంత మంది వ్యక్తులు ఆక్రమించారని వచ్చిన ఫిర్యాదు మేరకు ఆక్రమణను పరిశీలించాక ఆక్రమణకు గురైందని నిర్ధారణ చేస్తూ జెసిబి సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎస్- ఎస్‌వివిఎస్ నాయుడు మాట్లాడుతూ ఆక్రమణలు చేస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

రూ.15 వేలు వితరణ

వజ్రపుకొత్తూరు: డోకులపాడు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైర్ ప్లాంట్ మరమ్మతులకు గురైంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న డోకులపాడుకు చెందిన జనసేన వీరమహిళలు వాటర్ ప్యూరిఫైర్ మరమ్మతులకు రూ.15 వేలు అందించారు. అలాగే కొత్త ట్యాప్‌లు ఏర్పాటు చేశారు. వాటర్ ప్యూరిఫైర్ ప్లాంట్‌కు రక్షణగా స్టీల్ గ్రిల్స్ వేసి పాఠశాలకు అందించారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినం దనలు తెలిపారు. జనసేన వీరమహిళలు పుష్ప రామకృష్ణ, దాసరి లావణ్య, లలిత, సంగీత, సంతోషి, కుసుమ, డిల్లేశ్వరి, గౌరి పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ

వజ్రపుకొత్తూరు: పొల్లాడ పాఠశాలకు గ్రామ పెద్దలు, యువత రూ. 15,500 విలువ చేసే ప్రింటర్‌ను శు క్రవారం వితరణగా అందించారు. ప్రింటర్ అందించిన వారిలో కె.లక్ష్మణరావు, కె.చిన్నారావు, సర్పంచ్ అట్టాడ గోవిందరావు, పి.శ్రీనివాసరావు, ఎ.సుభాష్, ఎం.కిశోర్ ఉన్నారు. పాఠశాల నిర్వహణలో అత్యంత అవసరమైన ప్రింటర్‌ను వితరణగా అందించడంపై ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

టిటిడి కళ్యాణ మండపం నిర్మించాలి

టెక్కలి: డివిజన్, నియోజకవర్గ కేంద్రమైన టెక్కలిలో తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ టెక్కలి హిందూ దేవాలయాల పరిరక్షణ కమిటీ సభ్యులు కొరాడ రాంప్రసాద్ కోరారు. శుక్రవారం విజయ వాడలో మంత్రి అచ్చెన్నాయుడుని కలిసి వినతిపత్రం అందించారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలు శుభ కార్యక్రమాలు నిర్వహించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అదే విధంగా బిసి భవనం నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని కోరినట్లు తెలిపారు. మంత్రికి వినతిపత్రం అందించిన వారిలో మట్ట పురుషోత్తం, మెండ వెంకటరావు, దవళ రాజశేఖర్, టంకాల గణేష్ ఉన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తులతో ఉపాధి

ప్రజాశక్తి- ఆమదాలవలస

విలువ ఆధారిత ఉత్పత్తులతో గిరిజన యువతీ, యువకులకు ఉపాధి తద్వారా ఆదాయం సంపాదించవచ్చునని గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత అన్నారు. శుక్రవారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో పైనాపిల్ విలువాధారిత ఉత్పత్తులపై గిరిజన యువతీ, యువకులకు వృత్తి శిక్షణ కార్యక్రమాన్ని ఆర్ట్స్ సంస్థ మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీ నాబార్డ్ సహకారంతో, కృషి విజ్ఞాన కేంద్రం సాంకేతిక సహకారంతో శాస్త్రవేత్త డాక్టర్ బి. సునీత ఆధ్వర్యంలో మూడో రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యువతీ, యువకులకు పైనాపిల్ స్క్వాష్, జామ్ తయారు చేయడంపై శిక్షణను ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పైనాపిల్ విలువాధారిత ఉత్పత్తుల శిక్షణ ద్వారా యువతీ యువకులు ఉపాధి పొందుతూ మరి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త సునీత

కొంతమందికి ఉపాధి చూపించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో కెవికె ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, నాబార్డ్ డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ మేనేజర్ కె.రమేష్ కృష్ణ, ఆర్ట్స్ ఎన్‌జిఒ మన్యం సహజ ఉత్పత్తిదారుల సంఘం ఎఫ్‌పిఒ బెండి శంకరరావు, సిఇఒ ఎం.కృష్ణారావు, కెవికె శాస్త్రవేత్తలు, గిరిజన యువతీ, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి పలువురు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి- కొత్తూరు

మండలం మెట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన బొల్ల సాయి చరణ్, డిండిమ ప్రియదర్శిని, యజ్జల జ్యోత్స్న ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారు. వీరిని హెచ్‌ఎం డి.ఎల్.నరసింహులు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

బూర్జ: మండలంలోని ఓవిపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు దువ్వారపు పవిత్ర, గుమ్మడి యశ్విని, సిహెచ్ చంద్రశేఖర్, ఎం.రఘురాం, పి.వెంకటప్పారావులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయ సిబ్బంది, బోధ నేతర సిబ్బంది అభినందించారు.

పలాస: పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.దాశరథి, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం టి.చిట్టిబాబు ప్రకటనలో తెలిపారు. నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలు ఐఐఐటి కళాశాలలకు విద్యార్థులు ఎంపిక కావడం హర్షణీయమన్నారు.

రెంటి కోట పాఠశాల నుంచి

రెంటికోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు గీతాంజలి పాణిగ్రాహి, బెహర దొలై విజయ్, కుసిరెడ్డి హర్షిత, కృష్ణ ప్రియ మంత్ర, ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం ఎం.నిర్మల, ఉపాధ్యాయ బృందం, సర్పంచ్ తిరుమలరావు, పాఠశాల ఛైర్మన్ హెచ్. మహేష్, దువ్వాడ రవి అభినందనలు తెలియజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణరావు

రైతులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి- పలాస

మండలం రామకృష్ణాపురం సమీపం ఉజ్జుడుమెట్టకు ఆనుకొని ఉన్న ఉద్దాన ప్రాంత రైతులకు న్యాయం చేయాలని ఉజ్జుడుమెట్ట రైతు నాయకుడు సౌర లక్ష్మణరావు డిమాండ్ చేశారు. మండలం నీలావతిలో శుక్రవారం ఉజ్జుడుమెట్ట రైతులు, వామపక్ష నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామకృష్ణాపురం రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 143లో సుమారు 18 ఎకరాలు రావి సాంబశివరావు వద్ద రైతులు కొనుగోలు చేశారని, ప్రస్తుతం ఆ భూములు ఆక్రమణకు గురైందని చెప్పారు. ఎన్‌డిఎ ప్రభుత్వం చొరవ చూపి రైతులకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై రైతులు సుదీర్ఘ కాలం నుంచి రైతులు, రైతులతో పాటు వామపక్ష రైతు సంఘాల సమన్వయంతో పోరాటం చేస్తున్నామని, రైతుల పేరిట 1బి, అడంగల్ వచ్చేటట్లు చూడాలని కోరారు. సమావేశంలో రైతులు శ్రీను, లక్ష్మణరావు, సుందరమ్మ, సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్, నాయకులు మద్దిల రామారావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు వంకల మాధవరావు, సిపిఎం నాయకులు ఎన్.గణపతి పాల్గొని భవిష్యత్ కార్యాచరణ కోసం సూచనలు చేశారు.

రోడ్డుపై మురుగునీరు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలో కొద్దిపాటి వర్షానికే కాలువల్లో వెళ్లాల్సిన మురుగునీరు ప్రధాన రహదారిపై పొంగి పొర్లడంతో ద్విచక్ర వాహనదారులు, ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పురపాలక సంఘంలోని 17వ వార్డు పరిధిలోని పూజారిపేట నుంచి బొడ్డేపల్లిపేటకు వెళ్లే రహదారిలో మురుగునీరు రోడ్డుపైకి రావడంతో ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మురుగునీటి కాలువలపై పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగినప్పటికీ మున్సిపల్ సిబ్బంది పట్టించుకోవడం లేదని పలు వార్డుల ప్రజలు వాపోతున్నారు. సమితిల కాలంలో నిర్మించిన కాలువలే నేటికీ దర్శనమిస్తున్నాయని, అవి శిథిలమై కుచించుకుపోయి మురికి నీరు పోయే దారి లేక రోడ్డెక్కి ప్రవహిస్తుందని పలువురు గుర్తు చేస్తున్నారు. అలాగే పాతిన వారివీధి, కంద్రపేట, ఐజె నాయుడు కాలనీ,



పూజారిపేటలో రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు

గేటు తదితర ప్రాంతాల్లో మురుగునీటి కాలువలు శిథిలావస్థకు చేరుకోవడంతో చిన్నపాటి వర్షానికే మురుగునీరు రోడ్డుపైకి చేరి పొంగి ప్రవహిస్తుందని స్థానికులు చెబుతున్నారు. పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు మురుగునీటి సమస్యను పరిష్కరించి ప్రజల ఇబ్బందులను గట్టెక్కించాలని కోరుతున్నారు.

సాయిరాంకు సత్కారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రిమ్స్ వైద్య కళాశాల ఆఫీసు సూపరెంటెండెంట్‌గా ఉద్యోగోన్నతి పొందిన జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్, ఎపి ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాంను ఎపి ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టికల్ సబార్డినేట్ ఆఫీసర్స్ అసోషియేషన్ ఆధ్వర్యాన ఘనంగా సత్కరించారు. నగరంలోని ఎన్‌జిఒ హోంలో జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.సుధాకర్, జి.మనోహరరావు హాజరై పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సాయిరాం ప్రభుత్వ ఉద్యోగిగా తన బాధ్యతలను నిర్వర్తిస్తూనే ఉద్యోగుల సమస్యలపై ఎప్పటికప్పుడు తనదైన శైలిలో సహకరిస్తున్నారన్నారు. ఉద్యోగులకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యలపై సానుకూలంగా స్పందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బడగల పూర్ణచంద్రరావు, పిసి నందా, ఎ.మురళీకృష్ణ, పి.బాలరాజు, శేఖర్ బాబు, బి.గోవింద్, పి. అప్పల నాయుడు, వై.జోగారావు, పి.గణపతిరావు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ

కొత్తూరు: మండలంలో లబ్బ పంచాయతీ రైతుభరోసా కేంద్రం ద్వారా శుక్రవారం వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసి వర ప్రసాదరావు చేతులమీదుగా ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రికల్చరల్ అధికారులు రైతులకు, గ్రామస్తులకు గ్రామ సభలు పెట్టి సలహాలు, సూచనలు చేయాలన్నారు. రైతులు నూతన విధి విధానాలు అనుసరించి ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాలక రామ్మోహనరావు, నిమ్మక మంగులు, పసుపు రెడ్డి మోహనరావు, పసుపు రెడ్డి చంటి, పసుపు రెడ్డి జానీ, సునీల్, కుండంగి సత్యం, శ్రీను వెంకటకృష్ణ పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు ఘన సన్మానం

బూర్జ: మండలంలోని కొల్లివలస గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి పదోన్నతిపై అనకాపల్లి జిల్లా సబ్బవరానికి వెళ్లిన నూక రామకృష్ణను శుక్రవారం గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. గురుకులంలో ఐదేళ్లకు పైగా సేవలను అందజేశారని డిసిఒ బాలాజీ నాయక్ అన్నారు. అంతకు ముందు రామకృష్ణను ఘనంగా సన్మానించారు. కొల్లివలస, పాలకొండ గురుకుల ప్రిన్సిపాళ్లు దేవేంద్రరావు, శ్రీనివాసరావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యూరియా అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

కంచిలి: కంచిలి పిఎసిఎస్‌లో 20 టన్నుల యూరియా పక్కదారి పట్టిన సంఘటనపై దోషులను కఠినంగా శిక్షించాలని మండల టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో మాదిన రామారావు, బి.కురయ్య, టి.శోభన్ తదితరులు విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే రివ్యూ సమావేశంలో అడిగేదాక ఇంతటి అవినీతి జరిగిందని బయటకి తెలిసిపోవడం వైసిపి పాలన అంటే ఏంటో తెలిసిందన్నారు. ఇంకా అన్ని శాఖల్లో విచారణలు చేపడితే ఇంకెన్నో అవినీతి బాగోతాలు బయట పడతాయన్నారు. రైతులకు పంపిణీ చేయాల్సిన యూరియాను దోచుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. టిడిపి నాయకులు వి.రమేష్, పి.పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.

ముమ్మరంగా కాలువ పూడికతీతలు

సరుబుజ్జిలి: మండలంలోని ఖరీఫ్ రైతులకు సాగునీరు అందించేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వంశధార కుడి ప్రధాన కాలువలో పూడికతీత పనులను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశాలతో వంశధార అధికారులు కాలువలలో గత కొంతకాలంగా పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించ డానికి కొంత భాగాల వారీగా పనులను విభజించి నిర్వహించడానికి నిధులను కేటాయించారు. దీంతో సరుబుజ్జిలి గ్రామ పంచాయతీ సమీపంలో గ్రామ కమిటీ అధ్యక్షులు రామారావు ఆధ్వర్యంలో కాలువ పూడికతీత పనులను శుక్రవారం చేపట్టారు. మండల పరిధిలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న గ్రామస్థాయి టిడిపి నాయకులు రెండు రోజులుగా ప్రొక్లైన్ సహాయంతో కాలువలో నీటి ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా పనులను పూర్తి చేశారు.

పూడికలు తొలగిస్తే రైతులకు మేలు

కవిటి: గొనామారి గెడ్డలో పూడికలు తొలగించి అందుబాటులోకి తీసుకువస్తే రైతులకు మేలు జరుగుతుందని ఎపిడి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే బెందాలం అశోక్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బందితో కలిసి ఎపిడి శ్రీనివాస రెడ్డి గెడ్డను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొనామరి గెడ్డ రైతులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేలా అంచనాలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే అశోక్ సూచించినట్లు ఆయన తెలిపారు. గెడ్డలో పూడికలు తొలగిస్తే ఇటు జగతి నుంచి అటు మాణిక్యపురం వరకు రైతులకు ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎపిఒ మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వేలంపాట ఖరారు

కోటబొమ్మాళి: కొత్తమ్మతల్లి దేవస్థానంలో భక్తులకు ఫోటోలు, రక్షలు, తాళ్లు విక్రయించడానికి, భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరలు, జాకెట్టు ముక్కలను వసూలుకు, కొబ్బరి చెక్కలు వసూలు హక్కు కొరకు శు క్రవారం కొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో టెక్కలి గ్రూపు దేవాలయం కార్యనిర్వహణాధికారి పి.మనస్వి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు.